రాజీ

శ్రీమతి వి. లక్ష్మీకాంతమ్మగారు

సుబ్బలక్ష్మి బదరివాడ శేషగిరిరావుగారి భార్య. బాగాచదువుకొనినదే కాని చాల అర్భకురాలు. అందులో యేమేటకాన్పు. ముసిలిదేమిటి! పడుచుదే కాని ముసిలిదంటేనే బాగుంటుంది,ఆవిడ అత్తగారు. ఈవిడను అందరు చిన్నమ్మగారంటారు. డాక్టర్లు అంటోంటే విన్నకబుర్లివి—ముట్టుడిగేకాలంకి ఆడ వాళ్లల్లో చాలామార్పులు వస్తూంటాయిట. ఒహటంకల్లే వుండేవాళ్లు లావవడమో లేక లావాంటివాళ్ళు ఒహటంకల్లా గయిపోవడమో. యివేవీకాక బహు శాంతమూర్తుల్లా గుండేవాళ్లు చికాకు, పరాకు, అసహనము, దుందుడుకు, అనుమానము వగయిరాలు మనోవైకల్యస్థితుల పొందడమో కల్గుతూంటాయిట! అల్లాంటిస్థితే అయిఉండాలి చిన్నమ్మగారిది. లేకపోతే తాను గర్భిణీతోనుండగనే భర్తకాలంచేస్తే అతని ఆస్తిపాస్తుల యావత్తు దాయాదుల బారినుండి జాగ్రత్తపెట్టుకొని శేషగిరిరావును ఇంత వృద్ధికి తెచ్చి విద్వాంసుని చెయ్యగలదా? బంధుగులందరిలోను, అవుననిపించుకొని బ్రతికింది కాని ఒహరిచే యెన్నడయినా మాట అనిపించుకొన్నదనుట కయినా తావున్నదా ఆవిడజీవితం! అగ్నిహోత్రము ఆవిడంటేను! భారతభాగవతములు నాల్గూ చదివింది. అపరిమితమైన భగవద్భక్తి భూతదయ!! అన్నీమంచివే కాని వయస్సు మళ్ళినకొద్దీ అబ్బాయి సంసారం యేదో లోకంతో పాటుసాగుతూంటేతానూ తనయావత్కష్టములు అంతరించి సౌఖ్యోదయమయినదికదా అని ఆనందించవలసిన రోజులలో లేనిపోని లంపటాల్లో తగుల్కొని సంసారగొడవల్లో కష్టపడుతోండడం మాత్రం బాగుండలేదనాలి.

౨

తవదగ్గరే గారాబంగా పెరిగిన మేనగోడలు, కూతురు విశాలాక్షిని కన్నప్రేమకంటె పెంచిన ప్రేమ ఎక్కువని అంటారుకదూ అల్లాగ ఆపిల్ల చిన్నప్పటినుంచి తల్లిపురిటిలోనే అర్ధాన్నమైపోవటంచేత చంటిగుడ్డుస్థితినుండి తనదగ్గరేపెరిగి పెద్దదయింది. ఇప్పుడు కాపరానికి వెళ్లింది. శేషగిరిరావు దయాంతఃకరణలు గలవాడేగాని కోపమువస్తే మాత్రము వీళ్ళువాళ్ళుఅని చూచేవాడుకాడు. సాధారణంగా కోపమురానేరాదు. వచ్చినా చాలా తమాయిస్తాడు. అతనికి ఇంటికి వచ్చేటప్పటికి ఇంట్లో అంతా సంతోషముగా కనబడితే ఆనందం. ఇంట్లో రుసరుసలు పొడగట్టిందా ఎవరికో ఒకరికి దుంగశాష్టకాలు తప్పవు.

శేషగిరిరావు అప్పుడే కోర్టునుంచి బండి దిగాడు. బారిష్టరు గౌనుతోటి యింటిలోకి వచ్చేటప్పటికి చిన్నకొడుకు నాలుగేండ్లవాడు గుమ్మంలోనే కాళ్లు రెండు కౌగలించుకొని 'నాన్నగారూ' అని ఏడ్చాడు.

'ఏం నాయనా' అని ఎత్తుకొని ఇంటిలోకి వెళ్లాడు. సుబ్బలక్ష్మి రోజూ ఎదురుగా వచ్చేది ఆనాడు లోపల గదిలో కూర్చొని విచారంగా కనపడ్డది. తిన్నగా వంటఇంటిలోకి వెళ్లి 'అమ్మా! ఏం చేస్తున్నావు' అని మామూలుగా అడిగాడు. ఆవిడ ముఖంకూడా సంతోషశూన్యమే! తిన్నగా తన గదిలోనికి వెళ్లి చొక్కా, పాగా, డ్రస్సు అంతా తీసివేసి భార్యను కాళ్లు కడుగుకొనుటకు నీళ్లు తెమ్మన్నాడు. సుబ్బలక్ష్మి నీళ్లు తెచ్చి గదిగుమ్మంవద్ద పెట్టి నిలబడింది.

'తుమ్మల్లో ప్రొద్దుపుంకినట్లు అల్లాయున్నాయే ముఖాలు?' అని ప్రశ్నించాడు. సుబ్బలక్ష్మి పట్టజాలక 'నే నింక యీబాధ పడలేనండి. యేనూయియో గొయ్యో చూసుకుంటాను' అని ఏడ్వడం మొదలుపెట్టింది.

శేషగిరిరావున కంతా బోధ అయినది. మామూలుగా జరుగుతున్నదే. అయితేం కొంచెము తీవ్రమన్నమాట!

'సంగతేమిటో చెప్పు' అని దగ్గరగా దీసికొని భార్య కళ్లుతుడుస్తూ 'మామూలుదాని కింతవిచారమెందుకు' అన్నాడు.

భార్యను దగ్గరగా తీయడం బుజ్జగించడం గుసగుసలు కొద్దో గొప్పో చిన్నమ్మగారి కంటబడ్డాయి. ఎల్లాపడ్డాయి అంటారేమో? చిన్నమ్మగారికి కొడుకు కోడలు యేం మాట్లాడుకొంటున్నారో. తనమీద ఏం నేరాలు చెపుతోందో కోడలు విందాం అని తోచింది. ఎవరయినా ఇద్దరు కూర్చొని మాట్లాడుకొంటూంటే తన్నుగూర్చియో విశాలాక్షిని గురించియో అనియే అనుమానము. ఈలాంటి అనుమానాలు ఆపెను చాటునుండి పొంచి పొంచి వినుటకు ప్రోత్సహిస్తూంటాయి.

3

'ఏమీ లేదండీ, యీవేళ మా అందరి అదృష్టము బాగున్నది. మీకు కోపం రాలేదు. నేను సాధారణంగా ఆవిడ అభిప్రాయాన్ని కనిపెట్టి నెళ్లుతోనే యుంటాను. ఏమీలేదు తమరు, 'అమ్మాయీ నాలుగు రూపాయిలుంటే ఇవ్వవే' అని అడిగారు. 'నాదగ్గర ఏమీలేవు. మీ అబ్బాయిగార్ని అడిగి పుచ్చుకోండి' అన్నాను. దానితో రెచ్చిపోయినదండి వ్యాపారం.

"నేను అనాధను. చేతులోవున్న డబ్బంతా వాడి మొఘాన పెట్టినాను. బోలెడు డబ్బు ఖర్చుపెట్టి చదివించినాను. ప్లీడరీపరీక్ష చదివించినాను. అన్నీ చేశాను. తుదకు నాగతి ఇల్లా అయింది. నన్నూ నిన్నూ అడగడం లేదనడంన్నూ. నా కింతకంటె హైన్యంవుందా, యిందుకే చేతిలో డబ్బుండా లంటారు. చచ్చినట్లు అప్పుడు నా చుట్టూ యాభైసార్లు తిరుగుతోంటారు" అని యింకా యేమేమో అంటూ నన్నూ మావాళ్లనీ ఒక్కమాట గాదు అనవలసినవన్నీ అనేశారు. నా తల్లిదండ్రులకు అప్పచెల్లెండ్రకు అందరికీ శాపనార్థాలు పెట్టేశారు అప్పుడు నేను.

'ఎందుకండి అందరినీ అనడం. మీ ఇంటికి తిండికి చేరినదాన్ని నేనే గనుక నన్నే అనండి' అన్నాను. ఈ కరువుదినాల్లో మనం అన్నమే తింటున్నామో, గంజే తాగుతున్నామో. డబ్బు చిక్కులు యేమేమి పడుతున్నామో అన్నీ స్వయంగా చూస్తూనేయున్నారు కదా? నిన్న బియ్యంబస్తా మీరు తెప్పించింది అరువు తెచ్చానని చెప్పేసరికి నా కెంతో కష్టముగావుందే. తమ కెందుకు తెలియదు? అడగ్గానే డబ్బు యెక్కడ కురుస్తుంది. డబ్బు చిక్కు దినములలో మీరు ఎక్కడ వినుగుకొంటారో యని పిల్లలు చొక్కాలు లేవని యేడుస్తూన్నా-చినిగిపోయిన చొక్కా చూడండి. శంకరం బడిలోకి నే నిక వెళ్లనన్నా, వాడ్ని ఆ చొక్కాతో పంపడానికి ఎంతో మారాంపెట్టాడు. ఏంచెయ్యను. బతిమాలాను, బతిమాలాను చివరకి నాల్గుతికిపంపాను. ఏంచెయ్యను. బడిలో పిల్లలు మాస్టర్లు 'శంకరం! మీ నాన్నగార్కి కరువు వచ్చిందా. చినిగిపోయిన చొక్కాతో వచ్చావు' అని అంటే వాడు చిన్నబోయిన ముఖంతో నాదగ్గర ఏడ్చాడు. కాసేపు నే నేడ్చాను. ఆవిడకూడా యీ సంగతి స్వయంగా చూచేవుంది. ఏమీ మాట్లాడలేదు.

అన్నీ ఎరిగుండి యీమాటలః యేమిటి చెప్పండి. ఆవిడ అడగ్గానే నేను ఇవ్వాలట. మీతో చెప్పగూడదు. తెలియకూడదు. మీరు మంచివారేనట. అబ్బాయి యేంచేస్తాడు. తెచ్చి ఇంట్లోయిస్తే గృహయజమానురాలు నువ్వు. కనుక యిల్లాంటివల్లా నువ్వే చూసుకోవాలి. నీ మూలాన్ని నా కొడుకుఇంటికి పరాయిదాన్ని అయిపోయాను. నా బ్రతుక్కుసాయం యీ విశాలాక్షి యెందుకుదాపరించిందో. ఇదికూడ చస్తే యీబాధ యేమీలేకుండ సుఖంగా కృష్ణలో దిగిపోదునుకదా!! అని చంటిపిల్లలాగ విలవిల ఏడుస్తూంటారు. ఆ యేడుపుమాస్తే నాకే బాధగా ఉంటోంది. ఆవిడ యిల్లా క్షోభపడడము బాగుందికాదు. ఇదంతా నాతో వచ్చింది కనుక నేనే విరగడ అయిపోతే వదలుతుందేమో" అని సుబ్బలక్ష్మికూడా ఏడ్పు మొదలుపెట్టింది.

౪

‘శేషగిరిరావు’ ఇదంతా విని పెద్దనిట్టూర్పు విడిచాడు. ఒకవైపున కన్నతల్లి. రెండవ వైపున కట్టుకొన్న భార్య. వాళ్లిద్దరకు మనస్సులు పొసగకుండడం తన కపరిమిత పరితాపమునకు కారణమగుచున్నది. ఎవరిని అనుటకు వీలుగాలేదు.

“సరే. చాలా బాగాయుంది” అని చిలక్కొయ్యనున్న పట్టుతాపితాకట్టుకొని, కాళ్లు కడుగుకొని భోజనానికి లేచాడు. చిన్నమ్మగారు వడ్డించింది. శేషగిరిరావు తిన్నాడు. ఇది కావాలి, అది కావాలి అని ఈతడు అడుగలేదు. ఆవిడ పలుకరించలేదు. ఎవరు ముందు పలుకరిస్తే యేం గందరగోళం సిద్ధమవుతుందో అని యిద్దరి మనస్సులలో వుంది కాబోలు!

అంతలో సూర్యం తనవచ్చీరాని మాటలతో “నాన్నా, నాన్నా” అని పిలిచి మెమ్మదిగ వీపు మీద వాలి జందెము చేతివ్రేలికి చుట్టుకుంటూ “నాన్నా! బామ్మ మంచిదికాదు” అన్నాడు. ఎందుచేత గాదురా? అన్నాడు శేషగిరిరావు.

‘ఎందుకా’ అని బామ్మవైపు చూచి ‘చెప్పేస్తాలే’ అని ‘బామ్మేం అమ్మని కొత్తిందని’ అని తలవాల్చాడు.

‘భడవా! నువ్వు చూశావుట్రా అమ్మని కొట్టడం?’

‘కొత్తలేదు, మరి మరి అమ్మగదిలో కొచ్చి ఏడ్చిందేం మరి?’

‘యేడుస్తే?’

‘బామ్మకొత్తిందేమోని.’

‘అమ్మే కొట్టిందట బామ్మని.’

‘లేదు నాన్నా బామ్మేం-బామ్మేం. మళ్లీ చేతులతో బాదుకొంది తానే నాన్న గబగబా బాదుకొని ఏడ్చింది నాన్నా.’

‘ఏడిశావు. నోరు మూయి. నీ కక్కరలేని సంగతులు’ అని సూర్యాన్ని అవతలికి పొమ్మని పంపేశాడు శేషగిరిరావు.

చిన్నమ్మగారి ముఖం కొంచెం కోపాన్నే సూచిస్తుం దనాలి. కుఱ్ఱగాడు నాలుగేండ్లు. వెధవకే ఇంత కావరమా. తప్పు చిన్నమ్మగారిదే అని భావం తండ్రి దగ్గర తేలేశాడు. తల్లి రాక్షసబుద్ధులే పిల్లలకీనీ, తనని అనవసరంగా బయటపడేస్తోందని ఆవిడే నమ్మకం. తన యాధిక్యత కించెత్తూ గుర్తించటం లేదని అభిప్రాయము. ఇంటిపెత్తనం అంతా తనకే వప్పచెప్పింది కాదని మరోకాంక్ష. తన్నిక యెందుకూ పనికిరాని పరాయిదాన్నిగా చేశేశారని సొంత పెత్తనాలు వీళ్లవి అని అప్పుడప్పుడు అనుకోడం. అందులో ముఖ్యంగా సుబ్బలక్ష్మి తాలూకువాళ్లు. యే తల్లో, అప్పగార్లో, అన్నదమ్ములో, ఎవరో వకరు వచ్చారంటే ఆరోజున వంట సరిగావుండదు సరి కదా, యేమూలో కూర్చుని యేడవడమే. అడిగితే నాఅవస్థ నాది, నీవేమయిన ఆర్చేదానవా, తీర్చేదానవా అనడం. మనం కలుగజేసుకోకూడదని ఊరుకుంటే “చూశావా అత్తేరి నేనంటే యెవరికి అక్కరలేదు. యేడ్చి యేడ్చి ఆదే ఊరుకొంటుందని పలకరించింది కాదు అంటుంది. సూర్యంగాని, గోపిగాని ఎవరు అయినా దగ్గరకు వెళ్లి “బామ్మా! ఎందుకే యేడుస్తున్నావు” అని ఒడియందు చతికిలబడి రెండు చేతులు మెడకు చుట్టువేసి ముఖాన ముఖముంచి అడగొస్తే “ఛీ వెధవల్లారా! మీసమాత్రం ప్రేమ యేడిసిందిరా. పొండి. అవతలికి పొండి” అని క్రింద దూరంగా కూలవేస్తుంది.

౫

ఇరుగుపొరుగు అమ్మలక్కలంతా గుసగుసలు. ఏముంది. సుబ్బలక్ష్మిది తప్పా, అత్తగారిదా అని. సుబ్బలక్ష్మిది కాకపోతే, అత్తగారు ఇంటిపట్టున యెందుకుండదని సంవత్సరానికి పదకొండు మాసముల యిరవైరోజులు అక్కడా అక్కడా కాలం వెళ్లపోనుకోవడమేమి అని. ఇంటిదగ్గరనున్న పదిదినములైనా కలసి మెలసి సంతోషంగా కనబడదని!

ఇరుగుపొరుగువారు అల్లా అంటే యిక బంధుగుల సంగతో-వాళ్లు అంతే. సుబ్బలక్ష్మి అత్తగార్ని యింటిదగ్గరనుంచి లేవగొట్టింది. ఇద్దరికి ఒక్కగడియ పడదు. సుబ్బలక్ష్మి మాత్రం తక్కువదా అంటారు!

ఇంట్లో మనస్సులు, మనస్సులు కలియనపుడు ప్రతీదీ చెడ్డగానే కనిపిస్తుంది. ప్రతీదీ అనుమానంగానే తోస్తుంది. సుబ్బలక్ష్మిని గురించి అత్తగారే, 'మంచిదని తన్ను అన్నివిధాలా కనిపెట్టే నడుస్తోం'దని ఆవిడికి సంతోషంగా ఉన్న సమయాల్లో అంటోంటుంది. తనకి కోపం వచ్చినప్పుడుగాని చికాకుగా ఉన్నప్పుడుగాని సుబ్బలక్ష్మి సాధ్యమయినంతవరకు తటస్థంగానే ఉంటుంది. తటస్థంగా ఉంటే "మామగారా, నన్నిల్లా పలకరించనైనా పలకరించింది కాదు" అనడం! ఒకరోజున సుబ్బలక్ష్మి, సూర్యం ఏదో అల్లరిచేస్తూ బామ్మని తగిలినాడు.

"వెధవా! మైలడ్డావురా. మరోబట్టైనా లేదు. ఎల్లా ఏడవను" అని కోపముతో వాడిని రెండు చరుపులు చరిచింది. అమ్మదగ్గరకు వెళ్లి అమ్మచీరకొంగు మొగమున కడ్డము పెట్టుకొని ఏడ్చాడు.

'ఎందుకురా బామ్మని తగలడం' అంది తల్లి.

'ఎవలు దగిలాలూ?' అన్నాడు.

ఛా? నాక్కూడా కళ్లు లేవనుకున్నావా?

సూర్యం దార్లో చూసుకోవద్దూ అంత తొందరా మరి' అని రెండు బిస్కత్తులు చేతికిచ్చి పంపివేసింది సుబ్బలక్ష్మి.

'అంతలో నాకూ కళ్లు లేవనుకున్నావా' అన్న మాట చెవిలోబడి కాబోలు చిన్నమ్మగారు చరచర వచ్చి,

"నీ కొడుకును కొట్టటం నాదే బుద్ధి తక్కువ. జ్ఞానము వచ్చింది. నేటి కాలానికి నీచేత నాకళ్లు కూడా లేవనిపించుకోవలసివచ్చింది. నాకు కళ్లుంటే యింతమట్టుకు రాక నేపోను. నన్నిల్లా యేడ్పించి బాధపెడుతూన్నందుకు భగవంతుడంటో ఉంటే మిమ్మల్ని ఒకకంట చూడకుంటాడా. ఈ మిడిసిపాటు యెంతకాలమో చూస్తానులే. నన్ను పెట్టే బాధలన్నీ మీకు తగలకుంటాయి" అని వెక్కి వెక్కి యేడ్వడం మొదలుపెట్టింది.

సుబ్బలక్ష్మి నిర్ఘాంతపోయింది. అత్తగారి బట్ట తగిలిందన్నా తప్పే. ఊరుకున్నా తప్పే. ఏమని సమాధానమిచ్చుటకు తోచలేదు.

"అత్తయ్యా! మిమ్మల్ని నే నల్లాఅంటానా. సూర్యం మిమ్మల్ని తగలేదంటే నాకు కళ్లు లేవా అన్నాను కాని నేను చూడటంలేదా మిమ్మల్ని రానుపోవడం. మీ రల్లా ప్రతీదానికి మనస్సు కలతపెట్టుకోవడం బాగాలేదు."

"అయ్యో కబుర్ల కేమిలేోటు! నీజడ్డ ఎల్లాంటిది. నీకూ నీవాళ్లకీ నా ఉసురు తగులకపోతుందా. నేనిల్లా బతకడంకూడా యిష్టంలేదు. యేదో మిష పెట్టుకొని నాతో దెబ్బలాడుటకు సిద్ధమే. మొగాళ్లని చంపిపుట్టావు. సూర్యాన్ని ముట్టుకోమని నీవే పంపుండాలి. మొన్న అలాగే వాళ్ల నాన్నతోటి బామ్మ అమ్మని కొట్టిందనడానికి వాడికి నీవు అనమని చెప్పియుండకపోతే వాడెల్లా అనగలడు? ఇంతకీ యాదవకులానికి ముసలంలాగ దాపరించావు. నీవో నేనో ఒహళ్లం విరగడవుతేగాని యీ అవస్థలింతే."

"అనవసరంగా అల్లాకోపం తెచ్చుకుంటారేమిటి? మీకు పిచ్చి ఎక్కువ అవుతోంది. ఏవో పిల్లలను అన్న ముక్కలు మీమీద పెట్టుకొని యిల్లా అనడం మీకు తగినదికాదు. మీ కంత కష్టముగా ఉంటే నేనే విరగడయిపోతాను. మీరు మీ అబ్బాయి కులాసాగాయుండండి. ఇంక నన్ను మీరేమీ అనవద్దు. అనక మీ అబ్బాయిగారు వచ్చాక పిల్లలను ఆయనకు వప్పగించి నే నేదో దారి చూచుకుంటాను లెండి. ఈ సంసారములో నాకేమి."

అంతలో వీధితలుపు తట్టినట్లయ్యేను. శంకరం నాన్నొచ్చాడని గబగబా పరుగెత్తి వీధితలుపుతీసి "నాన్నా-నాన్నా" అన్నాడు.

"అమ్మేం-అమ్మే కాదు నాన్న. బామ్మ-బామ్మేం యేల్చింది నాన్నా. అమ్మని తిత్తింది. అమ్మ పోతానంతోంది నాన్నా" అని వీధిగుమ్మం దగ్గరే ఏకరవుపెట్టాడు.

౬

'నా కదంతా తెలియదు. మీ పిల్లల్ని మీరు జాగ్రత్త పెట్టుకోండి.'

'సంగతి ఏమిటో చెప్పరాదా.'

'యేమీలేదు. యీరోజుతో మీకు నాకూ ఏల యీ లోకంతోటే సరి. నే నింక బ్రతుకలేను.'

'కారణమేమో చెప్పరాదా.'

'ఋణము చెల్లుటే కారణం.'

'పాతకథేనా ?'

'నేను ఈబాధ భరించలేను. నేను విరగడవుతే గాని యీ సంసారము బాగుపడదు గనుక.......'

'ఈ వెధవగోల యెప్పుడు ఇంతేనా.'

'నాకు తెలియదు.'

'అవుతే నీ పిల్లల్ని నీతోటే తీసుకెళ్లు.'

'నా కక్కరలేదు. మీవల్ల కలిగినారు గనుక మీకు బాధ్యత.'

'నీవు కన్నావు గనుక నీదే భారము.'

అంతలో చిన్నమ్మగారు వచ్చి "దీనికంతకు కారణం నేను గనుక నేను యే నల్లమందో మ్రింగి చచ్చిపోతాను. మీరిద్దరు సుఖంగా ఉండండి. చిన్నప్పటినుంచి కష్టములే నాపాటు. కాపురానికి వెళ్లినది లగాయితు కష్టాలే నావంతు. పోనీ నువ్వు పెద్దవాడవయి గడించుచున్నావని సుఖపడే యోగ్యతా నాకు లేదు. యీ బాధలనుండి విముక్తి నాకే అవసరం గనుక......"

అమ్మా! నిజముగా నీకు మతిపోతోంది. అనవసరముగా యింట్లో యిద్దరు తగవులాడుతోవుంటే సంసారం యెల్లాగు? యజమానికి కొంచమయినా సుఖముండవలెనా, అక్కరలేదా? ఇంటికొచ్చేటప్పటికి దాని తన్న అది చస్తాను అంటే నీతన్న నీవు చస్తాను అంటూ యిద్దరూ యెవర్ని బెదరింపు. మధ్యన నాకు చావుగానున్నది. మీ రిద్దరకు దెబ్బలాటలు లేకుండా సంసారం అన్యోన్యంగా దిద్దుకుంటామని ప్రమాణం చేసేవరకూ నేను యీ యింటియందు అడుగు పెట్టను.

ఇదే వెళ్లిపోతున్నాను అని చటాలున యిల్లు వదలి ఎక్కడికో వెళ్లిపోయాడు శేషగిరిరావుగారు.

కొంపలో యీవరుస జగడములుంటే యజమాని బ్రతుకేమి కావలయును. అత్తగార్లయిన మహాసాధ్వీమణులారా! కోడండ్రపై చలమువహింప ఫలమా? ముక్తియా? మోక్షమా? మీరుకూడ కొండొకతరి కోడండ్రలై మెలగియుండలేదా. అప్పటి బాధ లేమయిన జ్ఞప్తికి వచ్చుచుండునా మధ్య మధ్య. స్త్రీ తొలుత దండ్రిచేతను వివాహానంతరము భర్తవలనను వృద్ధాప్యమందు తనయులచేతను, రక్షణ పొందుచు వారివారి యనుజ్ఞావర్తులయియుండుటే విధ్యుక్తధర్మమను పెద్దలనుడువుల యెరుంగరా. అటుల వారలకు తాము చేదోడు వాదోడై ఎల్ల కార్యముల సహాయముచేయుచు గృహమును స్వర్గతుల్యముగ చేయుట మీమీ విధ్యుక్తధర్మము గాదా.

చిన్నమ్మగారును సుబ్బలక్ష్మియు పూర్తిగా రాజీ అయ్యారు. శేషగిరిరావుగారు తిరిగి యింటికి వచ్చాడు. నాటినుండి యింతవరకూ మూడేళ్లు కావచ్చింది. ఇంతవరకూ యేమీ ఇంటిలో అడావిడులు లేవనే చెప్పాలి!

—:o:—

అవతారపురుషుడు

శ్రీపాద లక్ష్మీనారాయణమూర్తిగారు, బి. ఏ.

సీ. భరతావనీకృత ప్రాక్తన పుణ్యపుంజంబె రూపముగాంచి జన్మమందె
నఖిలహైందవ కృతయజ్ఞ యాగాద్యనుష్ఠాన సత్ఫలమిట్లు సంభవించె
నకలంకశాంతి సత్యప్రేమముఖసర్వ సద్గుణంబులె యిట్లు జన్మమందె
ధర్మసంస్థాపనార్థము పుట్టుచుందునా భగవంతుడే యిట్లు ప్రభవమందె

తే.గీ. ననుచు జనములు కొనియాడ నతిపవిత్ర
మైన భారతవర్షంబునందు బుట్టె
నఖిల జనసౌఖ్య సంపాద నానవరత
దీక్షితాత్ముడు శ్రీగాంధి దేవుడిలను.